RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in   rajadhanivoicedaily@gmail.com

RAJADHANI VOICE రాజధాని వాయిస్ TELUGU DAILY

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు మండలాల వారిగా విలేఖరులు కావవలెను ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 271 | 23 ఆదివారం ఆగష్టు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## ఏఈ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**– నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**– ప్రలోభాలకు లొంగవద్దని హెచ్చరిక**

**– విద్యుత్ రంగ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం**

**– మంత్రి గొట్టిపాటి రవికుమార్**



**అమరావతి, ఆగస్టు 22 :** రాష్ట్రంలోని వివిధ విద్యుత్ రంగ సంస్థల్లో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) ఉద్యోగాల భర్తీకి నిర్వహించనున్న నియామక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మొత్తం 629 ఖాళీల భర్తీ కోసం నిర్వహిస్తున్న ఈ పరీక్షకు లక్ష మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా పరీక్ష నిర్వహిస్తున్నందున నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాల పేరుతో కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తూ అభ్యర్థులను మోసగించే ప్రయత్నాలు చేసే అవకాశముందని మంత్రి హెచ్చరించారు. చెబుడు మాటలు, ప్రలోభాలు, మధ్యవర్తుల హామీలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే ప్రభుత్వానికి లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని అభ్యర్థులకు సూచించారు. అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో మానవ వనరులను పెంచడం ద్వారా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడమే లక్ష్యమన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. రాష్ట్రంలోని విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ సంస్థల్లో ఇంజినీరింగ్ సిబ్బంది కొరతను అధిగమించేందుకు ఈ నియామకాలు ఎంతో కీలకమని మంత్రి వివరించారు. ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ▶▶2

## భారత్ అభివృద్ధికి సంస్కరణలే బలం

**ప్రపంచ ఆశాకిరణంగా భారత్: ప్రధాని**

**వరల్డ్ లీడర్స్ ఫోరంలో కీలక ప్రసంగం**

**ఉత్పత్తి పెంపునకు ప్రోత్సాహక విధానాలు**

**స్థిరత్వమే దేశ ప్రగతికి పునాది**



**రాజధాని వాయిస్ న్యూఢిల్లీ, ఆగస్టు 22 :** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ అభివృద్ధి, ఆశలకు ప్రతీకగా నిలిచిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం––2026లో ప్రసంగించిన ఆయన, ప్రపంచం నేడు భారత్‌ను వృద్ధి, అవకాశాలు, స్థిరత్వానికి కేంద్రంగా చూస్తోందని పేర్కొన్నారు. దేశాన్ని అభివృద్ధి చెందిన భారతంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం వేగవంతమైన సంస్కరణలను అమలు చేస్తోందని చెప్పారు. విధాన పరమైన మార్పులతో పాటు పాలనా వ్యవస్థలో కూడా తదుపరి తరం సంస్కరణలను చేపడుతున్నామని ప్రధాని తెలిపారు. గతంలో ఉత్పత్తి పెంచిన సంస్థలను శిక్షించే విధానాలు ఉండేవని, ప్రస్తుతం ఉత్పత్తి పెంపునకు ▶▶2

## చంద్రంపాలెం పాఠశాలకు నూతన సదుపాయాలు

▶▶ మౌలిక వసతులను ప్రారంభించిన లోకేష్

▶▶ దివీస్ ల్యాబ్స్ సహకారంతో అభివృద్ధి

▶▶ ఆధునిక తరగతి గదుల పరిశీలన

▶▶ విద్యార్థులతో వాలీబాల్ ఆడిన మంత్రి



**రాజధాని వాయిస్ విశాఖపట్నం, ఆగస్టు 22 :** విశాఖ జిల్లా మధురవాడ ప్రాంతంలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివీస్ ల్యాబ్స్ సంస్థ సహకారంతో అభివృద్ధి చేసిన మౌలిక వసతులను రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించి విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిన కొత్త సదుపాయాలను సందర్శించారు. పాఠశాలలో ఆధునికీకరించిన తరగతి గదులు, విద్యా సౌకర్యాలు, క్రీడా మైదానాలను మంత్రి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా ▶▶2

## మూలపేటలో ఫార్మా యూనిట్‌కు ఆసక్తి

▶▶ గ్రాన్యూల్స్ ఇండియా ప్రతినిధులతో అచ్చెన్నాయుడు భేటీ

▶▶ పారిశ్రామిక హబ్‌గా మారనున్న ప్రాంతం

▶▶ యువతకు భారీ ఉపాధి అవకాశాల ఆశలు

▶▶ మౌలిక వసతులకు ప్రభుత్వ సహకారం హామీ



**శ్రీకాకుళం, ఆగస్టు 22 :** శ్రీకాకుళం జిల్లాను పారిశ్రామికంగా, ఆర్థికంగా మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలను వేగవంతం చేస్తోందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ అంతర్జాతీయ ఔషధ తయారీ సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు శనివారం ఆయనను కలిశారు. మూలపేట ప్రాంతంలో ఫార్మా యూనిట్ స్థాపనపై వారు ఆసక్తి వ్యక్తం చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఫార్మా పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూమి, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వేగవంతంగా మంజూరు చేసే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ▶▶2

## నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు

**31న సీఎం చేతుల మీదుగా వెలిగొండ ప్రారంభోత్సవం**

**నిర్వాసితులకు నేడు మరో 250 కోట్లు పరిహారం పంపిణీ**

**–జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు**



**రాజధాని వాయిస్ ఉండవల్లి, ఆగస్టు 22 ::** వెనుకబడిన, ఫ్లోరైడ్ భాదిత ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టును ఈనెల 31న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు ప్రారంభించనున్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఈ ప్రాజెక్టు ఫేజ్– 1 ప్రారంభం ద్వారా 10.7 టిఎంసిల కృష్ణమ్మ జలాలను నల్లమల సాగర్ కు ప్రవహింపజేయబోతున్నామని ఆయన వివరించారు. వెలిగొండ నిర్వాసితులకు సంబంధించి మూడవ విడతగా శనివారం ఉదయం 250 కోట్ల ▶▶2

## జాతీయ ఉపాధ్యాయ పురస్కారానికి ఏపీ గురువు ఎంపిక



**రాజధాని వాయిస్ అమరావతి :** ఆంధ్రప్రదేశ్ విద్యారంగానికి గర్వకారణంగా విజయనగరం జిల్లా చిన్నమల్లుపేట ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు కౌలూరి రాజేష్ జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు––2026కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విద్యా బోధనలో కృత్రిమ మేధస్సు, ఆధునిక సాంకేతికత వినియోగం, విద్యార్థుల్లో ప్రాథమిక అభ్యాస నైపుణ్యాల పెంపుదల కోసం ఆయన చేసిన కృషి దేశ స్థాయిలో గుర్తింపు పొందడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిగా చదివి, అదే వ్యవస్థలో ఉపాధ్యాయుడిగా సేవలందిస్తూ ఇప్పుడు జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపిక కావడం కౌలూరి రాజేష్ అంకితభావానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ అన్నారు. ఒక ఉపాధ్యాయుడు తరగతి గదిని మార్చగలిగితే, తరతరాల భవిష్యత్తును కూడా మార్చగలడని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడికి కౌలూరి రాజేష్ విజయం స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యా రంగంలో కొత్త ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడంలో ఆయన పాత్ర ప్రశంసనీయమన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లా గాంధారి ప్రాంతానికి చెందిన ప్రధానోపాధ్యాయురాలు బొంపెల్లి భవాని, అండమాన్ నికోబార్ దీవులకు చెందిన జెల్లి ప్రకాశ్ రావు కూడా జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు––2026కు ఎంపిక కావడం అభినందనీయమని పవన్ కల్యాణ్ తెలిపారు. వారిద్దరికీ కూడా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈ ముగ్గురు ఉపాధ్యాయులు దేశ విద్యారంగానికి విశిష్ట సేవలు అందించారని, భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చాలని ఆకాంక్షించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## ఆధునిక నగరంగా విశాఖ రూపాంతరం

**రాజధాని వాయిస్ విశాఖపట్నం, ఆగస్టు 22 :** విశాఖపట్నాన్ని ఆధునిక, ప్రణాళికాబద్ధమైన మహానగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగర మౌలిక వసతులు, రహదారులు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, గృహ నిర్మాణం వంటి అంశాలపై కూటమి ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ నగరానికి భవిష్యత్తులో తాగునీటి కొరత తలెత్తకుండా గోదావరి జలాలను నగరానికి తరలించే ప్రణాళికను ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. దీనికి అవసరమైన నీటి నిల్వ ప్రాంతాలను ఇప్పటికే గుర్తించామని, నగర ప్రజలకు దీర్ఘకాలిక తాగునీటి భద్రత కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు.ప్రతి కుటుంబానికి రోజుకు 135 లీటర్ల తాగునీరు అందించే లక్ష్యంతో రూ.1,000 కోట్ల వ్యయంతో ప్రత్యేక పథకాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. నగర విస్తరణ, జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరుల అభివృద్ధి, పంపిణీ వ్యవస్థ బలోపేతానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పరిశ్రమలకు అవసరమైన నీటి సరఫరా కోసం రూ.1,500 కోట్లతో మురుగునీటి శుద్ధి కేంద్రాల ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు మంత్రి వివరించారు. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు అందించడం ద్వారా తాగునీటి వనరులపై ఒత్తిడి తగ్గుతుందని, పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది దోహదపడుతుందని తెలిపారు.వెల్లంపేట గృహ నిర్మాణ ప్రాజెక్టు కింద 12 అంతస్తుల అపార్ట్‌మెంట్ భవనాలను నిర్మించి ప్రతి కుటుంబానికి 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో గృహాన్ని అందించనున్నట్లు వెల్లడించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన నివాస వసతులు కల్పించడం ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీటి భద్రత, గృహ నిర్మాణం, రహదారుల విస్తరణ వంటి అంశాల్లో వేగవంతమైన చర్యల ద్వారా విశాఖపట్నాన్ని దేశంలోనే అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు.


## డీఎస్సీపై తప్పుడు ప్రచారం సహించం

**– నియామకాల్లో అవినీతికి తావులేదన్న సీఎం**

**– వైసీపీ ఆరోపణలపై చంద్రబాబు మండిపాటు**

**– స్వచ్ఛాంధ్ర సభలో ప్రభుత్వ పనుల వివరణ**

**– వెలిగొండ, పోలవరం ప్రాజెక్టులపై కీలక ప్రకటనలు**



**రాజధాని వాయిస్ అనకాపల్లి, ఆగస్టు 22 :** మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై వస్తున్న విమర్శలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు. డీఎస్సీ నియామకాలలో ఒక్క శాతం కూడా అవినీతి జరగలేదని, జరగనివ్వబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్న నియామక ప్రక్రియపై కొందరు కావాలనే బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని అలమండ కోడూరులో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర––స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడారు. డీఎస్సీని అడ్డుకోవడానికి వందల సంఖ్యలో పిటిషన్లు దాఖలు చేసినా ప్రభుత్వం అన్ని అడ్డంకులను అధిగమించి ఉద్యోగాల భర్తీ చేపట్టిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్–1 పరీక్షల మూల్యాంకనంలో తీవ్రమైన అవకతవకలు జరిగాయని చంద్రబాబు ఆరోపించారు. సమాధాన పత్రాల మూల్యాంకనంలో అనర్హులను వినియోగించిన విషయాలు వెలుగులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు అదే వర్గాలు డీఎస్సీపై ఆరోపణలు చేయడం విచారకరమని అన్నారు. క్రీడాకారులకు కేంద్ర విధానాల ప్రకారం అదనపు అవకాశాలు కల్పించామని, క్రీడా కోటాను పెంచి ఉద్యోగాలు ఇవ్వడాన్ని కూడా విమర్శించడం సరికాదన్నారు. ▶▶2

## ఏఈ నూకరాజు భార్య మీనా మృతదేహం లభ్యం



రాజమహేంద్రవరం: ఇటీవల గోదావరిలోకి దూకిన పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబానికి సంబంధించి ఆయన భార్య మీనా మృతదేహం శనివారం లభ్యమైంది. ధవళేశ్వరం బ్యారేజ్ దిగువన సుమారు 30కి.మీ దూరంలో నదిలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. ఆరు రోజులుగా ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ముమ్మరంగా గాలించి.. ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం వద్ద మీనా మృతదేహాన్ని గుర్తించాయి. కాకినాడకు చెందిన రైఫిల్ షూటింగ్ శిక్షకుడు సాధిక్ ఖాన్ వేధింపులు తాళలేక నూకరాజు కుటుంబం ఈనెల 16న అర్ధరాత్రి రాజమహేంద్రవరంలోని రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరి నదిలో దూకిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో మనవడు కార్తికేయ నదిలో ఈదుకుంటూ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ నెల 17న నూకరాజు, 20న కుమార్తె సౌజన్య మృతదేహాలు లభ్యం కాగా, తాజాగా ఆయన భార్య మీనా మృతదేహాన్ని గుర్తించారు.

## ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఓట్లడిగే ప్రసక్తే లేదు: మంత్రి పొంగులేటి

**రాజధాని వాయిస్ నిజామాబాద్, ఆగస్టు 22** :నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి.. ఆ పేరుతో ఓట్లు అడిగే ప్రసక్తే లేదని మంత్రి పొంగు లేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో పర్యటించిన మంత్రి.. నగరంలో హౌసింగ్ టవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ ప్రవేశం చేసిన మహిళలకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు చెప్పారు. నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కొత్త టెక్నాలజీతో ఇందిరమ్మ మోడల్ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు.

## నేనేం తప్పుగా మాట్లాడలేదు: చిన్నారెడ్డి లేఖ

**రాజధాని వాయిస్ హైదరాబాద్** : వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ(డీఏసీ) ఇచ్చిన షోకాజ్ నోటీసులపై ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి స్పందించారు. తానేం తప్పుగా మాట్లాడలేదని లేఖలో పేర్కొన్నారు. "ఏ రోజూ నేను పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడలేదు. ఎవరిపైనా అనుచిత వ్యాఖ్యలు చేయలేదు. రెండున్నరేళ్లుగా కార్యకర్తల ఆవేదనను వ్యక్తంచేశా. స్థానిక ఎమ్మెల్యే వ్యవహారం ఒంటెద్దుపోకడలా ఉంది. నేతలు, కార్యకర్తలు పడుతున్న ఆవేదననే తెలిపా. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడాలనే ఉద్దేశం నాకు లేదు. పార్టీకి నష్టం కలిగించేవారిని ప్రశ్నించడమే నా ఉద్దేశం. నాపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం. వాటిపై విచారణ జరిపి న్యాయం చేయాలి" అని లేఖలో పేర్కొన్నారు.

## గచ్చిబౌలిలో కూలిన ఏడంతస్తుల భవనం.. ఇద్దరు మృతి



**రాజధాని వాయిస్** హైదరాబాద్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. శిథిలాల కింద నుంచి వారి మృతదేహాలను రెస్క్యూ సిబ్బంది వెలికితీశారు. నాలా పక్కనే 50 గజాల స్థలంలో నిర్మాణం చేపట్టిన ఈ భవనం ఒక్కసారిగా కుప్పకూలడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన టైల్స్ కార్మికులు ఉమేశ్ కారే (34), మోపత్ (42)గా గుర్తించారు. నిర్మాణం పూర్తయి అద్దెలకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న ఈ భవనం ఈ మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఒక్కసారిగా కూలిపోయింది. శిథిలాలు పక్కనే ఉన్న మరో అపార్ట్‌మెంట్‌పై పడటంతో పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనలో ఆ అపార్ట్‌మెంట్‌లో ఇద్దరు వృద్ధులు గాయపడ్డారు. అపార్ట్‌మెంట్ గోడలు ధ్వంసం కావడంతో అందులో ఉన్నవారు బయటకు వెళ్తున్నారు. అలాగే, పక్కనే ఉన్న ఓ హాస్టల్ విద్యార్థులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, ఫైర్, ఎస్‌డీఆర్‌ఎఫ్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది.. ఇంకా శిథిలాల కింద ఎవరైనా చిక్కుకొని ఉన్నారేమోనన్న అనుమానంతో సహాయక చర్యల్ని ముమ్మరం చేశారు. ఒకవేళ సాయంత్రం సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉంటే మాత్రం ప్రాణ నష్టం అధికంగా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ఘటనా స్థలిని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన పరిశీలించారు. సహాయక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

**బిల్డర్ కోసం గాలింపు!**

జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా భవనం నిర్మించారని, నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని పలువురు ఆరోపిస్తున్నారు. సరైన ప్రమాణాలు లేకుండా తక్కువ వ్యవధిలోనే నిర్మించడంతో నిర్మించడంతో పేకమేడలా కూలిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. మరోవైపు, ఈ భవనం నిర్మాణం చేస్తున్న బిల్డర్ సాజిద్ కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

## చంద్రంపాలెం పాఠశాలకు నూతన సదుపాయాలు



తీర్చిదిద్దే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. దివీస్ ల్యాబ్స్ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి అభినందించారు. ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు కలిసి పనిచేస్తే విద్యారంగంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా విద్యా ప్రమాణాలు పెరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలోని వివిధ సదుపాయాలను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. వారి విద్యాభ్యాసం, క్రీడా ఆసక్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి లోకేష్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా పాఠశాల ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. ఆధునిక తరగతి గదులు, క్రీడా సదుపాయాలు, మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన అవకాశాలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. చంద్రంపాలెం పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు ఇతర విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

## మూలపేటలో ఫార్మా యూనిట్‌కు ఆసక్తి



మూలపేట ప్రాంతంలో ఇప్పటికే కోరమాండల్ సంస్థ చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయని, ఇప్పుడు గ్రాన్యూల్స్ ఇండియా కూడా ముందుకు రావడంతో ఈ ప్రాంతం పారిశ్రామిక కేంద్రంగా రూపుదిద్దుకునే అవకాశాలు మరింత పెరిగాయని పేర్కొన్నారు. పరిశ్రమల విస్తరణతో ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊపిరి లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఫార్మా యూనిట్ ఏర్పాటుతో స్థానిక యువతకు వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని అచ్చెన్నాయుడు చెప్పారు. ఉపాధి అవకాశాల పెరుగుదలతో పాటు చిన్న, మధ్య తరహా వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయని, స్థానిక ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని వివరించారు. పారిశ్రామికవేత్తలకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేస్తోందన్నారు. పెట్టుబడిదారులకు నమ్మకం కల్పిస్తూ ఎటువంటి జాప్యం లేకుండా అవసరమైన అనుమతులు అందజేస్తున్నామని తెలిపారు. గతంలో తగ్గిన పారిశ్రామిక విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మూలపేటను రాష్ట్రంలోనే ఆదర్శ పారిశ్రామిక ప్రాంతంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని అచ్చెన్నాయుడు వెల్లడించారు. కొత్త పరిశ్రమల రాకతో శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి కొత్త అవకాశాలు తెరుచుకుంటాయని, ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పారిశ్రామిక రంగం కీలక పాత్ర పోషించనున్నదని పేర్కొన్నారు.

## భారత్ అభివృద్ధికి సంస్కరణలే బలం



ప్రోత్సాహకాలు అందించే వ్యవస్థను అమలు చేస్తున్నామని వివరించారు. లైసెన్స్ రాజ్ కాలంలోని పరిమితుల నుంచి బయటపడి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను ప్రోత్సహించే దిశగా దేశం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని మోదీ చెప్పారు. పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, డిజిటల్ వ్యవస్థలు, రక్షణ ఉత్పత్తి వంటి రంగాల్లో సాధించిన పురోగతి దేశ ఆర్థిక శక్తిని మరింత బలోపేతం చేసిందన్నారు. ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకాలు దేశీయ తయారీ రంగానికి కొత్త ఊపునిచ్చాయని వివరించారు. దేశంలో రాజకీయ స్థిరత్వం, విధానాల కొనసాగింపే పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచుతున్న ప్రధాన అంశాలని ప్రధాని పేర్కొన్నారు. స్థిరమైన ప్రభుత్వం, స్పష్టమైన విధానాలతో భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో విశ్వసనీయ భాగస్వామిగా నిలుస్తోందని చెప్పారు. సురక్షితమైన, స్థిరమైన భారత్ ప్రపంచ స్థిరత్వానికి కూడా దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సవాళ్ల మధ్య కూడా భారత్ అభివృద్ధి ప్రయాణాన్ని కొనసాగిస్తోందని ప్రధాని తెలిపారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, సాంకేతిక వినియోగం ద్వారా సమగ్ర అభివృద్ధి లక్ష్యాన్ని సాధిస్తున్నామని చెప్పారు. దేశాన్ని ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే దిశగా సంస్కరణల వేగం మరింత పెరుగుతుందని స్పష్టం చేశారు. ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం ప్రపంచ వ్యాప్తంగా విధాన నిర్ణేతలు, పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు పాల్గొనే ప్రతిష్ఠాత్మక వేదికగా గుర్తింపు పొందింది. ఈ వేదికపై ప్రధాని చేసిన వ్యాఖ్యలు భారత్ ఆర్థిక భవిష్యత్తు, పెట్టుబడుల అవకాశాలు, సంస్కరణల దిశపై అంతర్జాతీయ వర్గాల దృష్టిని ఆకర్షించాయి.

## కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ విద్యా భాగస్వామ్యం



లండన్, ఆగస్టు 22 : తెలంగాణ రైజింగ్ అధికారిక ప్రతినిధి బృందం లండన్ పర్యటన లో భాగంగా కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యావేత్తల బృందంతో కీలక సమావేశం నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలనే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను ఈ సందర్భంగా ప్రతినిధి బృందం వివరించింది. సమావేశంలో తెలంగాణలో ఉన్న విద్యా, సాంకేతిక, పరిశోధనా అవకాశా లను కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ ప్రతినిధులకు వివరించారు. ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించి అంతర్జాతీయ స్థాయి విద్యా వాతావరణం ఏర్పాటులో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. ప్రపంచ పెట్టుబడులు, విద్యా భాగస్వామ్యాలు, పరిశోధనా కేంద్రాల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న అనుకూల వాతావరణాన్ని కూడా వివరించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌కు చెందిన మార్కెటింగ్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, ఫ్రూగల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహ-చైర్మన్ ప్రొఫెసర్ వెంకటేశ్ గండికోట తెలంగాణ తో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు.

## ఏఈ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఏపీఈపీడీసీఎల్ సంస్థల్లో ఈ ఖాళీలు భర్తీ కానున్నాయని తెలిపారు. ఖాళీల భర్తీతో విద్యుత్ సేవల సామర్థ్యం పెరిగి వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న నియామక ప్రక్రియ పూర్తిగా ప్రతిభ ఆధారంగా సాగుతుందని, అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలని మంత్రి సూచించారు. కష్టపడి చదివిన వారికి తప్పకుండా మంచి ఫలితం లభిస్తుందని పేర్కొంటూ, యువత భవిష్యత్తు కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని కోరారు. 629 ఏఈ పోస్టుల భర్తీతో విద్యుత్ రంగంలో కొత్త ఉత్సాహం నెలకొంటుందని, రాష్ట్ర అభివృద్ధికి ఇది మరింత దోహదపడుతుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

## వెలిగొండ నిర్వాసితులకు రూ.250 కోట్లు

**ప్రకాశం, ఆగస్టు 22 :** వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లింపులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మూడో విడతగా రూ.250 కోట్ల పరిహారాన్ని అందజేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వాసితులకు పరిహారం చెక్కును అందజేశారు. ఈ చెల్లింపులతో ఇప్పటి వరకు మొత్తం 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతల్లో పరిహారం పంపిణీ చేపట్టింది. తొలి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు, రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లను చెల్లించింది. తాజాగా మూడో విడతలో 2,027 కుటుంబాలకు రూ.250 కోట్ల పరిహారాన్ని అందజేసి పునరావాస ప్రక్రియను మరింత వేగవంతం చేసింది. వెలిగొండ ప్రాజెక్టు కారణంగా భూములు, ఆస్తులు కోల్పోయిన కుటుంబాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ చెల్లింపులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. పరిహారం చెల్లింపులు వేగంగా పూర్తిచేయడం ద్వారా పునరావాస కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు వెల్లడిం చారు.

## నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు

రూపాయలను ముఖ్యమంత్రి పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద రామానాయుడు మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు ఉద్దేశించిన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంతో ఈ జిల్లాల ప్రజల దశ, దిశ మారబోతోందని ఆయన అన్నారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు వెలిగొండకు శ్రీకారం చుట్టారని, మళ్లీ ఆయనే, నేడు ముఖ్యమంత్రిగా వెలిగొండను ప్రారంభించబోతుండటం ఒక చరిత్రగా రామానాయుడు అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు వల్ల 4.47 లక్షల ఎకరాలకు సాగు, 23 లక్షల మందికి త్రాగు నీరందుతుందని ఆయన చెప్పారు. అలాగే వెలిగొండ నిర్వాసితులకు మూడు దశల్లో కేవలం 40 రోజుల వ్యవధిలో 760 కోట్ల రూపాయలను అందజేయటం, నిర్వాసితుల పట్ల ముఖ్యమంత్రికి ఉన్న బాధ్యతకు, ఆదరాభిమానాలకు నిదర్శనం అన్నారు. వెలిగొండ కు భూములు ఇచ్చిన త్యాగధనులకు పరిహారం ఇచ్చాకే, నీళ్ళు వదలాలని చంద్రబాబు చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాగే ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2250 కోట్లు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఈ రెండేళ్లలో ఇచ్చిన సంగతి కూడా ఆయన తెలియజేశారు. మొత్తం మీద కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ళలోనే, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వాసితులకు 3 వేల కోట్లు పరిహారం అందజేశామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు లో అర్హత ఉన్న ఆఖరి నిర్వాసితుడి వరకు న్యాయం చేస్తామని రామానాయుడు హామీ ఇచ్చారు. కాగా నాడు గొడ్డలి పార్టీ ప్రభుత్వ హయాంలో వెలిగొండ పనులు పూర్తవ్వకుండా, జగన్ జాతికి అంకితం చేసి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేశాడన్నారు. ఎల్ నినో వంటి క్లిష్ట సమయం లో నల్లమల సాగర్ కు 10.7 టీఎంసీ ల కృష్ణా జలాలను తీసుకొస్తున్నా మంటే చంద్రబాబు ముందుచూపుకి, దార్శనికతకు నిదర్శనం అని అన్నారు. భవిష్యత్ లో వెలిగొండ నీళ్లతో ప్రకాశం జిల్లా సస్యశ్యామలం కాబోతోంది అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తో పాటు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యేలు కందుల నారాయణ రెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి, అశోక్ రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇంఛార్జ్ ఎరిక్షన్ బాబు, వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులు పాల్గొన్నారు.

## డీఎస్సీపై తప్పుడు ప్రచారం సహించం




ఎక్కడో జరిగిన ఒక సంఘటనను మొత్తం నియామక ప్రక్రియకు అంటగట్టడం దురుద్దేశపూర్వక చర్యగా అభివర్ణించారు. తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ఐదేళ్ల పాలనపై కూడా ముఖ్యమంత్రి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో నకిలీ మద్యం, భూ సమస్యలు, పరిపాలనా వైఫల్యాలు పెరిగిపోయాయని ఆరోపించారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం పేరుతో అనేకమందికి ఇబ్బందులు కలిగించారని, భూముల విషయంలో అన్యాయాలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతి నెల 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమం ద్వారా పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తోందని వివరించారు. గత పాలనలో ఉపాధ్యాయులు, వివిధ వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. రహదారులు, మౌలిక వసతులు, గ్రామీణాభివృద్ధి రంగాల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. 'దీపం 2.0' పథకం ద్వారా మహిళలకు గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ అందిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం వల్ల విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని చెప్పారు. ప్రపంచ స్థాయి విద్యను అందించే లక్ష్యంతో విద్యా రంగంలో సంస్కరణలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా మంచి ఫలితాలు ఇస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. గత రెండేళ్లలో కోట్ల టన్నుల చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించామని తెలిపారు. చెత్త నుంచి గ్యాస్, సేంద్రియ ఎరువులు తయారు చేసే కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామాన్ని 'జీరో వేస్ట్' గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి కీలక ప్రకటనలు చేశారు. ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. వచ్చే నెలలో పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి ప్రాంతానికి నీటిని అందిస్తామని చెప్పారు. ఉత్తరాంధ్రను పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేసి, 10 వేల ఎకరాల్లో పారిశ్రామిక టౌన్‌షిప్ నిర్మిస్తామని ప్రకటించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎన్టీఆర్ రిజర్వాయర్, రైవాడ ప్రాజెక్టుల పూర్తి ద్వారా సాగు, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు అభివృద్ధిని గుర్తించి మంచి పాలనకు మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# టీటీడీ అన్నప్రసాద ట్రస్ట్‌కు విరాళం



**రూ.10 లక్షల డీడీ అందజేసిన దాత**
**అన్నప్రసాద సేవకు చేయూత**
**దాతకు కృతజ్ఞతలు తెలిపిన చైర్మన్**

**రాజధాని వాయిస్ హైదరాబాద్, ఆగస్టు 22 :** తిరుమల తిరుపతి దేవస్థానాల శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన దాత బండి సత్యనారాయణ రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు విరాళానికి సంబంధించిన డిమాండ్ డ్రాఫ్ట్‌ను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు హైదరాబాద్‌లోని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో శనివారం అందజేశారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద సేవకు ఈ విరాళం వినియోగించనున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన బీఆర్ నాయుడు, శ్రీవారి భక్తులకు ఉచితంగా అందిస్తున్న అన్నప్రసాద సేవలో భాగస్వాములవుతున్న దాతల సేవాభావాన్ని కొనియాడారు. భక్తుల సహకారంతోనే అన్నప్రసాద కార్యక్రమం నిరంతరం విజయవంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. దాత బండి సత్యనారాయణకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీ నిర్వహిస్తున్న అన్నప్రసాద ట్రస్ట్ తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు నిత్యం ఉచిత భోజన సదుపాయాన్ని అందిస్తోంది. ఈ సేవల నిర్వహణకు భక్తుల విరాళాలు ప్రధాన ఆధారంగా నిలుస్తున్నాయి. ట్రస్ట్‌కు అందే విరాళాల ద్వారా ఆహార పంపిణీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇటీవలి కాలంలో కూడా అనేక మంది భక్తులు అన్నప్రసాద ట్రస్ట్‌కు భారీ మొత్తాల్లో విరాళాలు అందజేస్తున్నారు. భక్తుల సహకారంతో శ్రీవారి సేవా కార్యక్రమాలు మరింత బలోపేతం అవుతున్నాయని టీటీడీ అధికారులు చెబుతున్నారు. దాతృత్వం ద్వారా భక్తులకు సేవ చేయాలనే సంకల్పంతో అనేక మంది ముందుకు రావడం ఆనందదాయకమని బీఆర్ నాయుడు పేర్కొన్నారు. అన్నప్రసాద సేవలో భాగస్వాములవుతున్న ప్రతి దాతకు శ్రీవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. విరాళాల రూపంలో అందుతున్న సహకారం భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. టీటీడీ అన్నప్రసాద ట్రస్ట్‌కు రూ.10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ విరాళాలు అందించే దాతలకు దేవస్థానం ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తోంది. భక్తుల సేవకు అంకితమైన ఈ కార్యక్రమంలో మరింత మంది భాగస్వాములు కావాలని టీటీడీ పిలుపునిస్తోంది.

# అనకాపల్లిలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

**అలమండ కోడూరు హెలిప్యాడ్ వద్ద ఆహ్వానం**
**స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్రకు ప్రజల భాగస్వామ్యం**
**అభివృద్ధి, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి**
**ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు**



**రాజధాని వాయిస్ అనకాపల్లి :** అనకాపల్లి జిల్లా అలమండ కోడూరు హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఘన స్వాగతం పలికారు. జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాల సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చిన వేళ ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు కలిసి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వంగలపూడి అనిత మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమం రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన ఉద్యమంగా మారిందన్నారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని ఆమె అన్నారు. గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా ప్రజల్లో కూడా సామాజిక బాధ్యత పెరగాలని సూచించారు. ప్రతి కుటుంబం పరిశుభ్రతను తమ బాధ్యతగా భావిస్తే స్వర్ణాంధ్ర లక్ష్యం త్వరగా సాకారమవుతుందని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కేవలం ప్రభుత్వ పథకం మాత్రమే కాదని, ఇది ప్రజల జీవనశైలిలో మార్పు తీసుకురావడానికి ఉద్దేశించిన సామాజిక ఉద్యమమని ఆమె పేర్కొన్నారు. చెత్త నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాల్లో ప్రజలు చైతన్యవంతులు కావాలని కోరారు. అనకాపల్లి జిల్లాలో పారిశ్రామిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని వంగలపూడి అనిత పేర్కొన్నారు. జిల్లాలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, ప్రజా సదుపాయాల విస్తరణ ద్వారా సమగ్ర అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం ఒక మహత్తర లక్ష్యమని, ఈ ప్రయాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఆమె పిలుపునిచ్చారు. పరిశుభ్రత, అభివృద్ధి, ప్రజా భాగస్వామ్యం అనే మూడు సూత్రాలతో రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి పనిచేయాలని కోరారు.

# బుచ్చిరెడ్డిపాళెం రోడ్లకు రూ.16 కోట్లు

**స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్రలో ఎమ్మెల్యే**
**త్వరలో టెండర్లు పిలుస్తామని వెల్లడి**
**కాజానగర్ పార్కు అభివృద్ధికి హామీ**
**మహిళల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి**



**రాజధాని వాయిస్ నెల్లూరు :** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో రహదారుల అభివృద్ధికి రూ.16 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రకటించిన రూ.45 కోట్ల అభివృద్ధి నిధుల్లో భాగంగా ఈ రహదారి పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు వెల్లడించారు. బుచ్చిరెడ్డిపాళెంలో ఏ రోడ్డు బాగోలేదనే విమర్శ వినిపించకుండా అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కాజానగర్‌లో నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్థానిక ప్రజలతో కలిసి పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను తెలుసుకుని అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కాజానగర్‌లో ఉన్న పార్కును ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. వీపీఆర్ ఫౌండేషన్ సహకారంతో పార్కు అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన వినోద, విశ్రాంతి వాతావరణం కల్పిస్తామని తెలిపారు. పిల్లలు, వృద్ధులు, మహిళలకు ఉపయోగపడే విధంగా పార్కును తీర్చిదిద్దే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముస్లిం మహిళల కోసం ప్రత్యేకంగా వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేయనున్నట్లు కూడా ఎమ్మెల్యే వెల్లడించారు. మహిళల ఆరోగ్యం, శారీరక దృఢత్వాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని షాదీ మంజిల్ అభివృద్ధి పనులను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎంపీ స్థానికాభివృద్ధి నిధుల నుంచి రూ.15 లక్షలు వినియోగించనున్నట్లు వెల్లడించారు. ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రహదారులు, పారిశుధ్యం, ప్రజా సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోం దని తెలిపారు. ఈ అభివృద్ధిని గుర్తించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కూటమి అభ్యర్థులను ఆదరించాలని పిలుపునిచ్చారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

**రాజధాని వాయిస్** కడప, ఆగస్టు 22 : జిల్లాలో రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు కడప జిల్లా పోలీసు శాఖ చేపట్టిన 'స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమం కొనసాగుతోంది. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా వాహనదారుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దూర ప్రయాణాలు చేసే డ్రైవర్లు అలసట, నిద్రమత్తు కారణంగా ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయని పోలీసులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వాహనదారులు కొంతసేపు ప్రయాణం నిలిపివేసి విశ్రాంతి తీసుకోవడం, ముఖం కడుక్కోవడం, శారీరకంగా చురుకుదనం పొందిన తర్వాతే ప్రయాణాన్ని కొనసాగించాలని సూచిస్తున్నారు. జాతీయ రహదారులు, ప్రధాన రోడ్లపై ప్రత్యేక తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసి డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో దీర్ఘదూర ప్రయాణాలు చేసే లారీ, బస్సు, ఇతర వాహనాల డ్రైవర్లను అప్రమత్తం చేస్తున్నారు. అలసటతో వాహనాలు నడపడం వల్ల సంభవించే ప్రమాదాల గురించి వివరిస్తున్నారు. రోడ్డు భద్రతలో డ్రైవర్ అప్రమత్తత అత్యంత కీలకమని పోలీసులు తెలిపారు. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, నిద్రమత్తులో వాహనం నడపడం వంటి కారణాల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి డ్రైవర్ తన భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు భద్రతా సూచనలతో కూడిన ప్రచార సామగ్రిని పంపిణీ చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్--112 సేవలను వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని అధికారులు పేర్కొన్నారు. 'స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమం ద్వారా రహదారులపై ప్రమాదాల సంఖ్యను తగ్గించడమే లక్ష్యమని కడప పోలీసులు తెలిపారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రతి వాహనదారుడు విశ్రాంతి, అప్రమత్తత, ట్రాఫిక్ నిబంధనల పాటింపును అలవర్చుకోవాలని కోరారు. ప్రజల సహకారంతో ప్రమాద రహిత జిల్లాగా కడపను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

# లా పరీక్షకు హాజరైన సౌమ్య

**ప్రజాసేవతో పాటు విద్యాభ్యాసం కొనసాగింపు**
**గుంటూరులో నిర్వహించిన సెమిస్టర్ పరీక్ష**
**న్యాయ విద్యపై ఆసక్తి చాటిన ఎమ్మెల్యే**
**యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న తీరుపై ప్రశంసలు**





**రాజధాని వాయిస్ గుంటూరు, ఆగస్టు 22 :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శనివారం గుంటూరులోని జె.సి. న్యాయ కళాశాలలో నిర్వహించిన మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ న్యాయశాస్త్ర పరీక్షలకు హాజరయ్యారు. ప్రజా ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తూనే ఉన్నత విద్యను కొనసాగిస్తూ ఆమె మరోసారి ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రజాసేవతో పాటు విద్యాభ్యాసానికి సమయం కేటాయిస్తూ తన వృత్తిపరమైన పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు సౌమ్య చూపుతున్న ఆసక్తి పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ప్రజా సమస్యల పరిష్కారం లో న్యాయపరమైన అవగాహన మరింత ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ఆమె న్యాయ విద్యను అభ్యసిస్తున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో నిర్వహించిన లాసెట్ పరీక్షలో అర్హత సాధించిన అనంతరం గుంటూరులోని జె.సి. న్యాయ కళాశాలలో మూడు సంవత్సరాల న్యాయశాస్త్ర కోర్సులో సౌమ్య ప్రవేశం పొందారు. అప్పటి నుంచి ప్రజా కార్యక్రమాలతో పాటు విద్యను సమన్వయం చేసుకుంటూ చదువును కొనసాగిస్తున్నారు. న్యాయ విద్య ద్వారా చట్టాలపై లోతైన అవగాహన పెంపొందించుకోవడ ంతో పాటు ప్రజా ప్రతినిధిగా మరింత సమర్థవంతంగా సేవలందించవచ్చనే అభిప్రాయంతో ఆమె ఈ కోర్సును ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ప్రజా జీవితంలో ఉన్నప్పటికీ విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం యువతకు ఆదర్శంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజా ప్రతినిధులు కూడా నిరంతర విద్యాభ్యాసాన్ని కొనసాగించవచ్చని సౌమ్య చర్య నిరూపిస్తోందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. బాధ్యతలతో కూడిన రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తూ పరీక్షలకు హాజరవడం క్రమశిక్షణ, అంకితభావానికి నిదర్శనమని అంటున్నారు. విద్య, ప్రజాసేవ రెండింటినీ సమన్వ యం చేస్తూ ముందుకు సాగుతున్న తంగిరాల సౌమ్య ప్రయాణం యువత ✓లో స్ఫూర్తిని నింపుతోంది. లక్ష్యసాధనకు వయస్సు లేదా పదవులు అడ్డంకి కావని, నిరంతర అభ్యాసమే విజయానికి మార్గమని ఆమె

# స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్రకు పోలీసుల మద్దతు

**పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పరిశుభ్రత కార్యక్రమం**
**ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక నిర్వహణ**
**స్వచ్ఛతపై అవగాహన కల్పించిన అధికారులు**
**ప్రజల భాగస్వామ్యానికి పిలుపు**





**రాజధాని వాయిస్ కడప:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కడప జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి. రమణయ్య పాల్గొని పరిశుభ్రత ప్రాముఖ్యతపై సిబ్బందికి అవగాహన కల్పించారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యాలయాలు, ప్రజా ప్రదేశాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్ పరిసరాల్లో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించి చెత్తను తొలగించారు. కార్యాలయ ప్రాంగణం, రహదారుల వెంట ఉన్న ప్రాంతాలను పరిశుభ్రపరిచారు. సిబ్బంది స్వయంగా పాల్గొని స్వచ్ఛత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పరిశుభ్రత కేవలం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిత్య జీవితంలో భాగం కావాలని పేర్కొన్నారు. స్వచ్ఛమైన వాతావరణం ప్రజారోగ్యానికి ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని కోరారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం పెరుగుతోందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. పరిశుభ్రతే ప్రగతికి సోపానమని, సమాజ అభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని అధికారులు పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రజలు, ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు.

# మైనర్ డ్రైవింగ్‌పై విద్యార్థులకు అవగాహన

**- దీప్తి జూనియర్ కళాశాలలో కార్యక్రమం - రోడ్డు భద్రతపై పోలీసులు సూచనలు**
**- చట్టాలపై విద్యార్థులకు వివరాలు - సురక్షిత ప్రయాణానికి జాగ్రత్తలు అవసరం**



**రాజధాని వాయిస్ ప్రొద్దుటూరు :** రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు కడప జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరులోని దీప్తి జూనియర్ కళాశాలలో మైనర్ డ్రైవింగ్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీసు అధికారులు మాట్లాడుతూ, చట్టబద్ధమైన వయస్సు రాకముందే వాహనాలు నడపడం ప్రమాదకరమని వివరించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల వారి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మోటారు వాహనాల చట్టంలోని నిబంధనలను విద్యార్థులకు వివరించిన అధికారులు, మైనర్ డ్రైవింగ్‌కు సంబంధించి విధించే జరిమానాలు, చట్టపరమైన చర్యల గురించి తెలియజేశారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతలో హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నియమాల పాటింపు, వేగ నియంత్రణ వంటి అంశాల ప్రాముఖ్యతను వివరించారు. రహదారులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల సంభవించే ప్రమాదాల గురించి ఉదాహరణలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-112 సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని అధికారులు కోరారు. రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండటం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు యువతలో సానుకూల మార్పు తీసుకువస్తాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. భవిష్యత్తులో కూడా విద్యాసంస్థల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు పోలీసులు తెలిపారు. రహదారులపై భద్రతే ప్రధాన లక్ష్యమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు.

### కారంపూడిలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

కారంపూడి.ఆగస్టు 22రాజధాని వాయిస్ :స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శనివారం మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను అభిమానులు,కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం కూటమి నాయకులు మాట్లాడుతూ,చిరంజీవి కేవలం సినిమాల్లోనే కాకుండా సమాజ సేవలోనూ ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కూటమి నేతలు బూస రామాంజనేయులు, కర్ణ సైదారావు, తోట అల్లయ్య, రంగా, కేసానుపల్లి కృష్ణబాబు, జనసేన పార్టీ కారంపూడి పట్టణ అధ్యక్షుడు తొలగినేని లక్ష్మయ్య తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో చిరంజీవి అభిమానులుపాల్గొన్నారు.

## ఎస్సీ,ఎస్టీ, దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

**పల్నాడు జేసి సంజనా సింహా**



**నరసరావుపేట.ఆగస్టు 22, రాజధాని వాయిస్:** ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని పల్నాడు జిల్లా సంయుక్త కలెక్టర్ సంజనా సింహ తెలిపారు.శనివారం కలెక్టరేట్లోనీ పిజిఆర్ఎస్ హాలులో ఎస్సీ, ఎస్టీ మరియు దివ్యాంగుల ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల గ్రీవెన్స్‌ను నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలకు సంబంధించిన 25 ఎస్సీ- 11, ఎస్టీ 7, దివ్యాంగులకు చెందిన 7 అర్జీలను సమర్పించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాల నిసంబంధితఅధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రీవెన్స్ లో అందిన ప్రతి అర్జీని పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల అభిప్రాయానికి ప్రాధాన్యతనిస్తూ పిజిఆర్ఎస్ సిటిజన్ ఫీడ్బ్యాక్ క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్నామని, సేవల పొందిన అనంతరం క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేసి అభిప్రాయాలను నమోదు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు



**పిడుగురాళ్ల.ఆగస్టు 22,రాజధాని వాయిస్:** పట్టణంలో శ్రీ సాయి వృద్ధాశ్రమం నందు జనసేన పార్టీ పిడుగురాళ్ల మండల అధ్యక్షుడు కామిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు, మెగా అభిమానుల సమక్షంలో పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి71 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సౌజన్య హాస్పిటల్ డాక్టర్ రావు హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు ఫ్రూట్స్ పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై నాగరాజు, రూరల్ ఎస్సై మోహన్, పట్టణ టిడిపి అధ్యక్షుడు పిల్లి చెన్నారావు, సీనియర్ నాయకులు వడ్లవల్లి సర్వేశ్వరరావు, వడ్లవల్లి సాంబశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ తురకా వీరస్వామి, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, వల్లెపు రామకృష్ణ, బిజిలి వెంకట్రావు,జనసేన నాయకులు,గుర్రం కోటేశ్వరరావు, కామిశెట్టి అమలింగేశ్వర రావు, జిల్లా సంయుక్త కార్యదర్శి దూదేకుల కాశీం సైదా, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు దూదేకుల సలీం, చిట్టెంశెట్టి పవన్ కుమార్, గుబ్బా విజయ సారది మాస్టర్, చింతా వెంకటశివరావు, జొన్నలగడ్డ రాజేష్, సూరం నాగమల్లి, కాపు నాయకులు నూతి నారాయణ, కొమ్మ మహేష్, చిలుకూరి శ్రీనివాస రావు, బేతంచర్ల కొండా మేస్త్రి, తిప్పనబోయిన వెంకట్రావు, వీర మహిళ సింగంశెట్టి వెంకట రమణ, మెగా అభిమానులు గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### అధికారుల స్పందనతోనే సమస్యల పరిష్కారం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



**మాచర్ల.ఆగస్టు 22రాజధాని వాయిస్ :**అధికారుల స్పందనతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు.శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి, పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని, గ్రౌండ్ లెవల్లో అధికారులు పరిష్కరాల మార్గాలు చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, కజ్జం సైదయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, కంభంపాటి అనిల్ కుమార్, అన్వర్, యంగ్ ప్రొపెషనల్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ--పచ్చని గుంటూరు నిర్మాణానికి పిలుపు



**గుంటూరు,రాజధాని వాయిస్ :** గుంటూరును స్వచ్ఛమైన, పచ్చని నగరంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్క పౌరుడు భాగస్వామి కావాలని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ ఐ. కిషోర్ పిలుపునిచ్చారు. నగర పరిశుభ్రత, పర్యావరణ పరిరక్ష ణ, సుస్థిర అభివృద్ధి కోసం ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి కుటుంబం, ప్రతి సంస్థ మొక్కలు నాటాలని సూచించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్ల పాత్ర కీలకమని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే విస్తృత స్థాయిలో వృక్షారోపణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్లలోనే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. చెత్తను వర్గీకరించడం వల్ల వ్యర్థాల నిర్వహణ సులభమవడంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని వివరించారు. పరిశుభ్రమైన నగర నిర్మాణంలో ఈ చర్య కీలకమని చెప్పారు.సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ కారణంగా పర్యావరణానికి, జీవావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని పేర్కొంటూ, ప్రత్యామ్నాయంగా పునర్వినియోగ సంచులు, పర్యావరణహిత వస్తువులను ఉపయోగించాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో భాగంగా గుంటూరును ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు, విద్యార్థులు కలిసి ముందుకు రావాలని అదనపు కమిషనర్ ఐ. కిషోర్ కోరారు. పరిశుభ్రమైన, పచ్చని గుంటూరు నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

## మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం

**- జిల్లా ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక చర్యలు - రాజంపేటలో నిర్వహించిన పోలీసుల కార్యక్రమం**

**- భద్రతా సేవలపై మహిళలకు అవగాహన**



**రాజంపేట, ఆగస్టు 22 రాజధాని వాయిస్ :** మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు రాజంపేట పట్టణంలో ప్రత్యేక అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజంపేట పట్టణ సీఐ నాగార్జున నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రభుత్వం, పోలీసు శాఖ అమలు చేస్తున్న వివిధ భద్రతా చర్యల గురించి వివరించారు. మహిళలు ఎదుర్కొనే వేధింపులు, నేరాలు, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులను ఆశ్రయించా లని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-112 సేవలను వినియోగించుకోవాలని, మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న 'శక్తి' వంటి ప్రత్యేక సేవలపై అవగాహన కల్పించారు. ఫిర్యా దుల స్వీకరణ, తక్షణ స్పందన వ్యవస్థ గురించి కూడా వివరిం చారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని సీఐ నాగార్జున తెలిపారు. సమాజంలో మహిళలు భయాందోళనలు లేకుండా జీవించేందుకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మహిళలు, విద్యార్థినులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. మహిళల భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు పోలీసు సేవలను మరింత చేరువ చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు.

## రెవెన్యూ ఉద్యోగుల కోసం మెగా ఆరోగ్య శిబిరం

**- గుంటూరులో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన**

**- ఉద్యోగుల ఆరోగ్యమే మెరుగైన సేవలకు పునాది**

**- కుటుంబ సభ్యులకు కూడా వైద్య పరీక్షలు**

**- వైద్య సేవలందించిన ఆసుపత్రులకు అభినందనలు**







**రాజధాని వాయిస్ గుంటూరు, ఆగస్టు 22 :** రెవెన్యూ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా గుంటూరు నగరంలోని బీఆర్ స్టేడియంలో శనివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఉద్యోగులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించగలరని అన్నారు. నిత్యం ప్రజల సమస్యల పరిష్కారంలో నిమగ్నమై ఉండే రెవెన్యూ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవస రమని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ మెగా వైద్య శిబిరం అభినందనీయమని చెప్పారు.జిల్లాలోని ప్రతి రెవెన్యూ ఉద్యోగి, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని పేర్కొన్నారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, నిరంతర వైద్య పర్యవేక్షణ కల్పించడం ద్వారా ఉద్యోగుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ శిబిరం ద్వారా అనేక మందికి ఉపయోగకరమైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. వివిధ ప్రత్యేక వైద్య విభాగాలకు చెందిన నిపుణులు శిబిరంలో సేవలందించారు. సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, నేత్ర, దంత, ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు, చికిత్స సూచనలు అందజేశారు. పలువురు ఉద్యోగులు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.శిబిరం నిర్వహణకు సహకరించిన ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్యులు, వైద్య సిబ్బందికి కలెక్టర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వంతో పాటు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న వైద్య సంస్థల సేవలు అభినందనీయమన్నారు. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నజీర్ అహ్మద్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఆర్డీఓ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల నుంచి మెగా హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది.

### ఇన్‌స్టాగ్రామ్ వీడియోతో కుటుంబానికి ఊరట

**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 22 :** ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అయిన రామమూర్తి కుటుంబ పరిస్థితిని గమనించిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి, కుటుంబానికి అవసరమైన అన్ని ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రి సూచనల మేరకు సంబంధిత శాఖల అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయ కార్యక్రమాలను ప్రారంభించారు.కుటుంబానికి శాశ్వత నివాస సౌకర్యం కల్పించేందుకు ఎస్ఏపీఎఫ్ ద్వారా రూ.5 లక్షల గృహ నిర్మాణ నిధులను మంజూరు చేశారు. ఇంటి నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమైనట్లు అధికారులు వెల్లడించారు. కొత్త ఇల్లు పూర్తయ్యే వరకు కుటుంబ సభ్యులను తాత్కాలికంగా ఒక ప్రైవేటు ఇంటికి తరలించి అవసరమైన సౌకర్యాలు కల్పించారు. కుటుంబంలోని దివ్యాంగ మహిళకు నెలకు రూ.15 వేల పెన్షన్ మంజూరు చేసే ప్రక్రియను కూడా అధికారులు వేగవంతం చేశారు. ఇందుకు అవసరమైన సదరం ధ్రువీకరణ పత్రం ఇప్పటికే పూర్తయిందని, త్వరలో వైద్య మండలి నుంచి తుది ధ్రువీకరణ పత్రం అందిన వెంటనే పెన్షన్ మంజూరు చేస్తామని తెలిపారు.

## మిట్టా జంగమయ్యను ఘనంగా సన్మానించిన వైకాపా నేతలు





**పిడుగురాళ్ల.ఆగస్టు 22,రాజధాని వాయిస్:**గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆశీస్సులతో పల్నాడు జిల్లా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ పబ్లిసిటి వింగ్ ఉపాధ్యక్షుడుగా మిట్టా జంగమయ్య యాదవ్ ను నియమించిన సందర్భంగా వైసిపి అనుబంధాల వివిధ విభాగాల నాయకులు,కార్యకర్తలు జంగమయ్యకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మూడేల వెంకటేశ్వర రెడ్డి,జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు గొట్టిముక్కల మట్టా రెడ్డి, ఉపాధ్యక్షుడు మాబు,రాష్ట్ర బిసి సెల్ జాయింట్ సెక్రటరీ శెట్టిపల్లి పూర్ణ,జిల్లా స్టూడెంట్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ అంకిరెడ్డి, జిల్లా బూత్ వింగ్ వైస్ ప్రెసిడెంటు వెన్నా సిరి ప్రతాప్ రెడ్డి,పిఎసిఎస్ ప్రెసిడెంట్ గోగిరెడ్డి పిచ్చిరెడ్డి, బ్రాహ్మణపల్లి కొండలు, మాచవరం మండలం సోషల్ మీడియా అధ్యక్షులు పొట్లూరి శ్రీను,పెద అగ్రహారం బిసిసెల్ అద్యక్షుడు డాక్టర్ అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే బీసీ సాధికారిత సాధ్యం ఎమ్మెల్యే జూలకంటి



**వెల్దుర్తి.ఆగస్టు 22రాజధాని వాయిస్ :**బీసీల సాధికారిత టీడీపీతోనే సాధ్యపడుతోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ ప్రకటించారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గుర్తు చేశారు. శనివారం స్దానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శిరిగిరిపాడు గ్రామం లోని బీసీ కులానికి చెందిన 10 కుటుంబాల వారు వైసీపీని వీడి, ఎమ్మెల్యే జూలకంటి సమక్షంలో టీడీపీలోకి చేరారు. పార్టీలోకి వస్తున్న వారందరికీ పార్టీ కండువా కప్పి సాధరంగా ఆహ్మానిం చారు ఎమ్మెల్యే. టిడిపి సీనియర్ నాయకులు కళ్ళం రామాంజి రెడ్డి, కుర్రి శివారెడ్డి, సంజీవ రెడ్డి, మాజీ సర్పంచ్ వజ్రాల మల్లయ్య ఆధ్వర్యంలో ముదిరాజ్ సామాజీకవర్గానికి చెందిన వారందరూ టీడీపీలో బీసీ సామాజీకవర్గాలకు ఇస్తున్న ప్రాధాన్యత చూసి, పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ కండువా కప్పుకున్న వారిలో ఏసుబోయిన మన్నెయ్య, గడిగుంట్ల వెంకటేశ్వర్లు, హనుమయ్య,రవీంద్రబాబు, ప్రసాదు, గండూరి చినమల్లయ్య తదితర కుటుంబాలు ఉన్నాయి.

### అభివృద్ధికి నిదర్శనం కూటమి పాలన కరపత్రాల పంపిణీ



**బెల్లంకొండ.ఆగస్టు 22రాజధాని వాయిస్ :** రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో సాగుతున్న ప్రగతి ప్రస్థానానికి తాము పంపిణీ చేస్తున్న కరపత్రాలే ప్రత్యక్ష సాక్ష్యమని టీడీపీ నేత ఎన్. రవి పేర్కొన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా శనివారం వన్నాయపాలెం గ్రామంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ స్థానిక సమస్యలను తెలుసుకుంటూనే, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సూపర్-6 పథకాలతో పాటు మహిళలు, రైతులు, యువత, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి ఒక్క కూటమి ప్రభుత్వానికే సాధ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, స్థానిక గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### చిరంజీవి జీవితం యువతకు ఆదర్శం ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు.ఆగస్టు 22 రాజధాని వాయిస్ :** స్వయంకృషితో ఎదిగి పద్మవిభూషణ్ స్థాయికి చేరిన మెగాస్టార్ చిరంజీవి జీవితం ప్రతి ఒక్కరికీ గొప్ప స్ఫూర్తి అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. జనసేన నేత ఆళ్ల హరి ఆధ్వర్యంలో జరిగిన చిరంజీవి జన్మదిన వేడుకల్లో ఆమె మాట్లాడారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే ఆయన వ్యక్తిత్వం, రక్తదానం-నేత్రదానం వంటి విస్తృత సేవా కార్యక్రమాలు సమాజానికి మార్గదర్శకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com